



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఇంటికొకరు..!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీజనల్ జ్వరాలు వణికిస్తున్నాయి. వాటిలో డెంగీ కేసులే అధికంగా ఉన్నాయి. డెంగీ కేసులు పెరుగుతుండటంతో జిల్లా వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా ఇంటికొకరు జ్వరం బారిన పడి చికిత్స పొందుతున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

- విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు - చర్యలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/మహానంది

సీజనల్ జ్వరాలు ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలను వణికిస్తున్నాయి. వ్యాపిస్తున్న జ్వరాల్లో వైరల్ జ్వరాలతో పాటు డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. డెంగీ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేవలం దోమల ద్వారా, చల్లని వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే డెంగీ వ్యాధి ప్రభలే అవకాశం ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డ్రెయినేజీలు, మురుగు గుంటల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగి డెంగీ విజృంభిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం కర్నూలు జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ 409 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 211 డెంగీ కేసులు నమోదయ్యాయి. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ నాలుగు మలేరియా కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ 251 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 110 డెంగీ కేసులు నమోదయ్యాయి. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ 22 మలేరియా కేసులు నమోదు కాగా ఇప్పటి వరకూ రెండు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడం, డ్రయినేటీ కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల శిరివెళ్ల మండలంలో బాలికకు డెంగ్యూ నిర్ధారణ అయింది. మహానంది మండలంలోని పలు గ్రామాల్లో పిల్లలు, పెద్దలు సీజనల్ వ్యాధులతో అల్లాడి పోతున్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉంటోంది. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండి దోమలు స్వైరవిహారం చేయడంతో, వైరల్ జ్వరాలు వెంటాడుతున్నాయి. దీంతో పేదలు ప్రైవేటు ఆసుపత్రులపాలై జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. వారం రోజులుగా మండలంలోని గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పాఠశాలల వసతి గృహాల్లో కూడా విద్యార్థులు విష జ్వరాలతో, దగ్గు, జలుబులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం మండలంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు చాలామంది విష జ్వరాల బారిన పడ్డారు. పత్తికొండ మండలంలోనూ వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పత్తికొండ సిహెచ్‌సికి రోజూ 200 మంది వరకూ రోగులు వస్తున్నారు. అందులో వంద మంది వరకూ జ్వర బాధుతులే ఉంటున్నారు. వైద్య సిబ్బంది తగిన చికిత్సలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపం వల్ల దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ కోసం గ్రామాల్లో ఫాగింగ్ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రయివేటు దోపిడీ

వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటాన్ని ప్రయివేటు ఆస్పత్రులు ఆదాయంగా మలచుకుంటున్నాయి. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళితే చాలు తొలుత టెస్టుల పేరుతో వేలకు వేలు దండుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్(రక్తపలికలు) తగ్గాయన్న పేరుతో ఆస్పత్రిలో చేరాలని భయపెడుతున్నారు. ఆస్పత్రిలో చేరితే మందులు, బెడ్ ఛార్జీలు, డాక్టర్ ఫీజులు తదితర పేర్లతో దోచుకుంటున్నారు. ఏకంగా లక్షలు వసూలు చేస్తూ రోగుల జేబులు ఖాళీ చేస్తున్నారు.

డెంగీ లక్షణాలు ఇలా

ఒక్కసారిగా జ్వరం రావడం, తలనొప్పి అధికంగా ఉండడం, ఎక్కువగా నొసటిపై తలనొప్పిగా ఉండడం, కంటి లోపల, కన్ను కదిలించినప్పుడు నొప్పిగా ఉండడం, కండరాలు, కీళ్లనొప్పులు ఉండడం, వాంతి అనిపించడం, నోరు ఎండిపోయి ఎక్కువ దాహంగా ఉండడం.

సిఎం పర్యటనను విజయవంతం చేయండి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- పత్తికొండ

ఈ నెల 31 న కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాష, జాయింట్ కలెక్టర్ నవ్య, జిల్లా ఎస్‌పి బిందు మాధవ్, ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ ,ఆర్‌డిఒ రామలక్ష్మి పుచ్చకాయలమాడ గ్రామంలో పర్యటించారు. 31 రాష్ట్ర ముఖ్యమంత్రి వృద్ధులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుచ్చకాయల మాడ గ్రామంలో పెన్షన్ల పంపిణీలో పాల్గొంటున్నారని తెలిపారు. పెన్షన్ల పంపిణీ అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్తులతో సంభాషిస్తారని కలెక్టర్ తెలిపారు. పర్యటన సందర్భంగా జిల్లా అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బందోబస్తు, కాన్వాయ్ ఏర్పాట్లపై ఎస్‌పితో సమీక్షించారు. హెలిప్యాడ్, గ్రామంలో ప్రజావేదిక నిర్వహణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, జనరేటర్లు ఏర్పాటు చేయాలని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్‌ఇని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా చెట్లు నరికి వేయడం గాని, బ్యారికేడింగ్ ఏర్పాట్లు గాని, కార్పెట్‌లు వేయడం లాంటివి చేయకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు తాగునీరు, టాయ్లెట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిపిఒ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇలను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం వైద్య సిబ్బంది, అంబులెన్స్ ల ఏర్పాటు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు తదితర ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. సభా వేదికపై సౌండ్ సిస్టమ్, ఎల్‌ఇడి స్క్రీన్లు, మీడియా గ్యాలరీ ఏర్పాటు, లైవ్ స్ట్రీమింగ్ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సమాచార శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేయాలని డ్వామా పిడిని కలెక్టర్ ఆదేశించారు. ఇతర ఏర్పాట్లపై కూడా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్లు అందరు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండలాల తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. వారి వెంట కర్నూలు , ఆదోని ఆర్‌డిఒలు శేషిరెడ్డి, విశ్వనాథ్, పత్తికొండ డిఎస్‌పి వెంకటరామయ్య, పత్తికొండ అర్బన్ సిఐ జయన్న, పత్తికొండ తహశీల్దార్ వెంకటలక్ష్మి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

31న పత్తికొండకు సిఎం చంద్రబాబు రాక

- పుచ్చకాయలమాడలో పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 31న శనివారం కర్నూలు జిల్లా పర్యటనకు రానున్నారు. పత్తికొండ నియోజకవర్గంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. పత్తికొండ మండలంలోని పుచ్చకాయల మాడ గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని అధికార వర్గాలు వెల్లడించాయి. అనంతరం అక్కడే జరిగే గ్రామసభలో కూడా సీఎం పాల్గొని ప్రసంగిస్తారు.

అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

- ఆదోని, ఎమ్మిగనూరులలో పోలీసు స్టేషన్ల పరిశీలన
- రాత్రి గస్తీని పెంచాలని ఆదేశం
- ఎస్‌పి బిందు మాధవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆదోని ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్ , ఆదోని రెండవ పట్టణ పోలీసుస్టేషన్ , ఎమ్మిగనూరు అర్బన్ పోలీసుస్టేషన్లను బుధవారం అర్ధరాత్రి జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గస్తీ పోలీసులతో జిల్లా ఎస్‌పి మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టిచర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి పలుసూచనలు చేశారు. రాత్రి వేళ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విధుల్లో సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానస్పద వ్యక్తులు తారసపడితే విచారించాలన్నారు. అసాంఘిక కార్యకలపాలను నివారించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజల్లో అభద్రతా భావాన్ని తొలగించేందుకు నైట్‌పెట్రోలింగ్ వ్యవస్థను పునరుద్ధరించామన్నారు. ప్రజలలో అభద్రత భావాన్ని తొలగించేందుకు గట్టి చర్యలు చేపట్టామన్నారు. ప్రజల భద్రతకు రాత్రి గస్తీ, విజిబుల్ పోలీసింగ్ బాగా పెంచామన్నారు. రద్దీ ప్రాంతాలలో నేరాల నివారణకు సిసిటివికెమెరాలు ఏర్పాటు చేసే విధంగా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నేర చరిత్ర ఆధారంగా క్రైమ్ హాట్‌స్పాట్‌లను గుర్తించాలన్నారు. ఆ ప్రాంతాల పై పోలీసులు పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. పోలీసుల ఉనికి గురించి నేరగాళ్ళకు తెలియకుండా రాండమైజ్డ్‌గా గస్తీలు నిర్వహించాలన్నారు. మ్యాన్‌ప్యాక్‌లు వినియోగించాలన్నారు. క్రైమ్ పీక్ అవర్స్ , హైరిస్క్ ఉన్న ప్రాంతాలలో డిఎస్‌పిలు, సిఐలు , ఎస్‌ఐలు స్థాయి పర్యవేక్షణాధికారులుగా ఉండి రాత్రి గస్తీ తనిఖీలు చేయాలన్నారు. సమస్యలున్నచోట ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమర్థవంతమైన పోలీసింగ్‌తో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలని పోలీసు అధికారులకు, గస్తీ పోలీసులకు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ సూచించారు. జిల్లా ఎస్‌పితో పాటు స్పెషల్ బ్రాంచి సిఐ ప్రసాద్, ఆదోని పట్టణ సిఐ శ్రీరామ్ ఉన్నారు.



తనిఖీలు చేపడుతున్న ఎస్‌పి బిందు మాధవ్

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ఎపి శాక్స్ ఆదేశాల మేరకు సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం 'మీకు తెలుసా?'ను కెవిఆర్ కాలేజ్, కోడుమూర్‌లో నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.మునీర్ అహ్మద్ మాట్లాడుతూ హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధులకు ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. యువతకు హెచ్‌ఐవి గురించి అవగాహన లేకపోవడం సామాజిక మాధ్యమాలు, చెడు సహవాసాల కారణంగా హెచ్‌ఐవికి గురవుతారని తెలిపారు. 2017 ఎయిడ్స్ నియంత్రణ, నివారణ చట్టం ప్రకారం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల, వారి కుటుంబ సభ్యుల పట్ల వివక్షత చూపరాదని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జి.శేఖర్, ఎఎన్‌ఎం పుష్పలతా, సునీత, వెంకటమ్మ, పద్మజ, సేకూన్, సుశీలమ్మ పాల్గొన్నారు.

విఆర్‌ఒల బదిలీలా.. మజాకా..!

- నేతల సిఫార్సు లేఖలతో పైరవీలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

గ్రామ రెవెన్యూ అధికారుల చేతిలోనే భూములు ఉండడంతో అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైన విఆర్‌ఒలు ఉంటే తమ పనులకు డోకా లేకుండా దృష్టి సారించారు. గ్రామాల్లో విఆర్‌ఒ పోస్టింగ్లకు ఇప్పటికే అధికార పార్టీ ముఖ్య నేతలు జాబితాలను తయారు చేసి అధికార యంత్రంగానికి పంపేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యమైన గ్రామాల్లో పోస్టింగుల కోసం పెద్దఎత్తున వసూళ్లను కూడా చేపడుతున్నారు. జిల్లాలో రెవిన్యూ శాఖలో ఐదు సంవత్సరాలు ఒకే స్టేషన్ పూర్తి చేసుకున్న వారు దాదాపుగా 66 మంది విఆర్‌ఒలు ఉన్నారు. వాస్తవానికి వీరికి మాత్రమే ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం బదిలీ చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు గత ప్రభుత్వంలో పనిచేసినటువంటి విఆర్‌ఒల అందర్నీ మార్చివేయాలని అధికార పార్టీలోనే క్షేత్రస్థాయి నేతలు ఎమ్మెల్యేలకు విన్నవించుకున్నారు. గతంలో పనిచేసిన విఆర్‌ఒలతో గ్రామాల్లో పని చేయించుకోలేమని అనుకూలమైన వారిని వేయించుకుంటే పనులు సాఫీగా సాగుతాయని క్షేత్రస్థాయి నేతలు ఎమ్మెల్యేలు ముందు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలోని కర్నూలు కల్లూరు ఓర్వకల్ గూడూరు సిబెలగల్ కోడుమూరు వెల్దుర్తి తదితర మండలాల్లో విఆర్‌ఒ పోస్టింగులకు అధికార పార్టీ నేతలు పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. సదరు మండలాల్లోని గ్రామాల్లో ఉన్న భూములు విలువ పెద్ద ఎత్తున ఉండడంతో ఎలాగైనా ఇక్కడికి బదిలీ చేయించుకునేందుకు విఆర్‌ఒ కూడా అధికార పార్టీ ముఖ్య నేతల చుట్టూ తిరుగుతున్నారు. తమకు అనుకూలమైన గ్రామాలకు పోస్టింగులు ఇస్తే అన్ని పనులను చేసి పెడతామని అధికార పార్టీ నేతలకు విఆర్‌ఒ మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు క్షేత్ర స్థాయిలోనే నాయకుల నుండి పేర్లను సేకరించి సిఫార్సు చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో పోస్టింగ్ కోసం రూ.లక్ష నుండి రూ.5 లక్షల వరకు కూడా వసూలు చేసినట్లు సమాచారం. సిఫార్సు లేఖలు తమ పేర్లు ఉండేలా అధికార పార్టీ నేతలకు విఆర్‌ఒలు కూడా డబ్బులు కూడా ముట్ట చెబుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయానికి కొంతమంది ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గంలోని గ్రామాల వారిగా ఎంపిక చేసిన విఆర్‌ఒల పేర్ల జాబితాలను అందజేశారు. ఈ జాబితాను కలెక్టర్ జాయింట్ కలెక్టర్ పరిశీలించిన అనంతరం మరో వారం రోజుల తర్వాత పోస్టింగ్లను ఇచ్చేందుకు కూడా సిద్ధమయ్యారు.



పశుసంవర్ధక శాఖ సంచాలకులకు వినతిప్రతం ఇస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

పశుసంవర్ధక శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలలను నిర్మించాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి -కర్నూలు అగ్రికల్చర్

పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలలను కూల్చి కొత్తవి నిర్మించాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులకు డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి నగేష్, సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషలు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో రైతన్నలకు వ్యవసాయం ఎంతగా జీవనాధారమో పాడి పెంపకం కూడా అంతే ముఖ్యమని అన్నారు. అలాంటి పాడిపెంపకం పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా దాదాపు 25 కు పైగా పశువైద్యశాలలు ప్రమాద అంచులో ఉన్నాయని, సరైన సౌకర్యాలు కూడా లేకుండా విధులు నిర్వహించే పరిస్థితి ఉందని అన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా గోపాలమిత్ర అటెండర్లతోనే సేవలు చేయించడం చాలా దుర్మార్గమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 300, పారా వెటర్నరీ పోస్టులు 600 సబార్డినేట్ పోస్టులు 1822 ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు.

నాయి బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం

కనీస వేతనం రూ.25వేల పెంపు అభినందనీయం

జాతీయనాయిబ్రాహ్మణ సవితా సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయకుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నాయి బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25వేలకు పెంచినందుకు ప్రభుత్వానికి టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జాతీయ నాయి బ్రాహ్మణ సవితా సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకవీటి విజయకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. దేవాలయాలలో పనిచేసే నాయి బ్రాహ్మణులకు రూ. 25వేలు కనీస వేతనంగా ప్రకటించడం దేవాలయాల పాలక మండలిలో నాయి బ్రాహ్మణులకు స్థానం కల్పించడం హర్షనీయం అన్నారు. బీసీ డిక్లరేషన్‌ను బీసీలకు రక్షణ చట్టంను త్వరగా అమలుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. క్షౌరశాలలో 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్, స్థానిక ఎన్నికలలో నాయి బ్రాహ్మణులకు పోటీపడే శక్తి లేనందున వారికి కో ఆప్షన్ మెంబర్‌గా నియమించే ప్రక్రియను పూర్తి చేస్తారని, బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ సౌకర్యం కల్పిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటుగా రఘు, రాఘవేంద్ర, శివ, ఉదయ ప్రతాప్, నరేంద్ర, గిడ్డయ్య పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

ధ్యాన్ చంద్ సాధించిన విజయాలతో యువత స్ఫూర్తి పొందుతూ క్రీడల్లో ఉన్నత స్థానంలో రాణించాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు సూచించారు. గురువారం కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీని ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, జెండా ఊపి ప్రారంభించారు. ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ పుట్టిన రోజునే జాతీయ క్రీడాదినోత్సవంగా ప్రకటించి ఆయనను గౌరవించుకుంటున్నామన్నారు. క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఆయన పేరుతో జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ ఒలంపిక్స్‌లో సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి క్రీడాకారుడు పతకాలు సాధించాలన్నారు. క్రీడల్లో ఇతర దేశాలతో పోటీపడి పతకాల సాధనలో భారతదేశం ముందు ఉండే విధంగా క్రీడాకారులు కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ ఒలంపిక్స్ లో మూడు సార్లు దేశానికి పతకాలు సాధించారన్నారు. వాటిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు చిన్నప్పటి నుంచే విద్యతో పాటు క్రీడలలో ప్రోత్సహించడం వల్ల వారి మనోవికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. క్రీడాకారులలో స్ఫూర్తిని నింపడానికే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.



జెండా ఊపి క్రీడాదినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎంపి నాగరాజు

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ప్రముఖ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ సాధించిన పతకాల వల్ల మన దేశానికి కీర్తి, ప్రతిష్టతలు వచ్చాయన్నారు. అందుకు విద్యార్థులకు చిన్నప్పటి నుంచే క్రీడలను అలవాటు చేయడం వల్ల వారు మానసికంగా, శారీరకంగా ధృఢంగా తయారవుతారన్నారు. డిఎస్‌డిఒ భూపతిరావు, జడ్‌పిసిఇఒ నాసర రెడ్డి, సెట్కూరు సిఇఒ పివి.రమణ, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాష అభివృద్ధికి కృషి



పత్తిఓబులయ్యను, దండెబోయిన పార్వతిని సన్మానిస్తున్న డిఆర్‌ఒ, తదితరులు

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

తెలుగు భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి డిఆర్‌ఒ జిల్లా స్థాయి అధికారులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. డిఆర్‌ఒ మాట్లాడుతూ ఒకప్పుడు హిందీభాష తరువాత తెలుగు మాట్లాడే వారు ఎక్కువగా ఉండడం వల్ల తెలుగు భాష రెండవ స్థానంలో ఉండేదన్నారు. ఇతర భాషలతో పాటు తెలుగును కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తెలుగులో ఎక్కువ శాతం రచనలు చేశారన్నారు. గిరిజనులకు సంబంధించిన సవర భాషను కూడా గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు వ్యాకరణం రాశారన్నారు. టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కెవిఆర్ కళాశాల తెలుగు ఉపాధ్యాయురాలు పార్వతీ దేవిని డిఆర్‌ఒ శాలువతో సత్కరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జిల్లా పర్యాటక అధికారి విజయ, జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ లోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉస్మానియా కళాశాలలో : ఉస్మానియా కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత కవి డాక్టర్ బివి.స్వరూప్ సిన్హా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాష మాధుర్యాన్ని, గొప్పదనాన్ని గ్రహించి ఆంగ్లేయులు సైతం తెలుగు భాషకు సేవ చేశారని సిపి బ్రౌన్ వేమన పద్యాలను సేకరించి మొదటి ఆంగ్ల తెలుగు నిఘంటువును తయారు చేశారని అన్నారు. అధ్యక్షత వహించిన ఉస్మానియా కళాశాల కార్యదర్శి , కరస్పాండెంట్ అజ్రాజావేద్ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. కె.అరుణా దేవి వందన సమర్పణ చేశారు.



ఉస్మానియా కలేజీలో స్వరూప్ సిన్హాను సన్మానిస్తున అజ్రాబావెద్



నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న బంగిశ్రీధర్

రీజినల్ ఆఫీసులను రద్దు చేశాకే బదిలీలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

వాణిజ్య పన్నుల శాఖలో రీజినల్ ఆఫీసులను రద్దు చేశాకే బదిలీలు చేపట్టాలని ఎపిజిఇఎ కర్నూలు జిల్లా ప్రసిడెంట్ బంగి శ్రీధర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర పతి ఉత్తర్వులకు విరుద్ధంగా ఆర్డర్‌టు సర్వ్ పేరుతో గతంలో చేసిన బదిలీల వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగుల హక్కులకోసం పోరాడే ఏకైక సమర్థమైన నాయుకడు కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో హక్కులు సాధించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. కర్నూలు వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎపిసిటి సర్వీసెస్ అసోసియేషన్ కు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ సర్వస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దశరథ రఘురామరెడ్డి, ఎపిజిఇఎ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్ రెడ్డి ,నగర అధ్యక్షుడు మురళీధర్ నాయుడు, నగర కార్యదర్శి చెన్న కృష్ణ పాల్గొన్నారు.



భాష్యంలో విద్యార్థుల భువన విజయం సన్నివేశం

'భాష్యం'లో తెలుగుభాష దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భాష్యం విద్యాసంస్థల ఇఒ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం భాష్యం పాఠశాల కృష్ణా నగర్‌లో తెలుగు భాషా దినోత్సవం , జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు గిడుగు వెంకట రామమూర్తి, శ్రీకృష్ణదేవరాయలు, తెలుగు భాష గొప్పతనం గురించి చక్కటి ప్రదర్శనలు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులందరూ దేశభాషలందు తెలుగు లెస్స అంటూ తెలుగు భాషను పొగుడుతూ ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.చిన్న సుంకన్న కర్నూలు డిస్టిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముఖ్యఅతిథిగా వచ్చి క్రీడారంగం గొప్పతనాన్ని క్షుణ్ణంగా వివరించారు. హాకీదిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడాదినోత్సంగా జరుపుకుంటామని తెలిపారు. విద్యార్థులందరూ క్రీడారంగంలో రాణించాలని సూచించారు. హెచ్‌ఎం కె.రమాదేవి , వైస్ ప్రిన్సిపల్ ఎం.సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ఆసక్తితో కార్యక్రమంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ప్రతి ఎకరాకూ సాగునీరు

- సాగునీటి ప్రాజెక్టులను నాశనం చేసిన వైసిపి - ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక బీవీ నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టులను నాశనం చేసి ఇప్పుడు టిడిపిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి సాగు నీటి ప్రాజెక్టులపై వివరించినట్లు తెలిపారు. వైసిపి నేతలు జిఆర్‌పి, ఆర్‌డిఎస్, గాజులదిన్నె ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వీటికి మరమ్మతులు చేపట్టి పెండింగ్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక జిఆర్‌పి నుంచి సాగునీరు అందడం లేదని చెప్పడం అవగాహన రాహిత్యమని చెప్పారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని చేపట్టి సాగు, తాగు నీరు అందిస్తామని తెలిపారు. టిడిపి నాయకులు ఈరన్న గౌడ్, మాధవ్ రావు దేశాయ్, గురరాజారావు దేశాయ్, కలీముల్లా, రంగస్వామి గౌడ్, నారాయణ రెడ్డి, నేసే మల్లికార్జున, అల్తాఫ్, మిన్నప్ప, ఖాసీం వలీ, శాబీర్, బందేనవాజ్, బండే గురుస్వామి, దామ నరసింహులు, కటారి రాజేంద్ర, జహంగీర్, హమాలీ ఉరుకుందు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


మాట్లాడుతున్న నాయకులు


ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోటార్ వాహన చట్టం, జిఒ 21ని ప్రవేశపెట్టి గత ప్రభుత్వాలు ఆటో కార్మికుల పొట్ట కొట్టాయని విమర్శించారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. పట్టణాల్లో ఆటోలు నిలవడానికి స్థలానికి కేటాయించాలని, వాహన మిత్ర కింద రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని తెలిపారు.

అగ్రహారం ఆటో స్టాండ్ నూతన కమిటీ

అగ్రహారం ఆటో స్టాండ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా బి.రాముడు, అధ్యక్షులుగా ఎం.గిరి రాజ్, ఉపాధ్యక్షులుగా కుదూస్ బాష, రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రంగస్వామి, సహాయ కార్యదర్శిగా సునీల్, రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా శంకర్, మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రైతులకు కరువు పరిహారం జమ చేయాలి

- కాంగ్రెస్ నాయకులు


నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

అతివృష్టి, అనావృష్టి వల్ల వంట నష్టపోయిన రైతులకు కరువు పరిహారం జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవి శెట్టి ప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ కక్షల్లో భాగంగా ఆ గ్రామ అధికారులతో కలిసి అక్కడున్న రాజకీయ నాయకులు ఒత్తిళ్లతో కొంత మంది రైతులకు కరువు డబ్బులు వచ్చినా వేయకుండా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఈ విషయంపై ఆదోని సబ్ కలెక్టర్‌కు విన్నవించామన్నారు. వెంటనే ఆదోని మండలంలోని దొడ్డనగేరి, నేమకల్లు, జాలమంచి గ్రామాల రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. లేకపోతే పెద్దఎత్తున రైతులతో దీక్షలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాయన్న, నెట్టేకల్ హనుమంతుడు, లక్ష్మన్న, రుద్దమని, నరసప్ప, నీలకంఠ, ఉరుకుందమ్మ, చాకలి నరసప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిలిచి రోడ్డులో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలోని మాధవరం రోడ్డు కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద చాలా రోజులుగా రోడ్డు కోతకు గురైంది. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతలో ఎక్కువ కాలం నీరు నిలిచి ఉంటుంది. సిరుగుప్ప, సింధనూరు, మాధవరం, పెద్దహరివాణం, పెద్దతుంబలం, ఉరుకుంద, మంత్రాలయం, బళ్లారి బస్సులు, వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. బైక్‌పై వెళ్లేవారు నీళ్లలో వెళ్లలేక పక్కన పోవడం వల్ల అదుపుతప్పి కిందపడిన సందర్భాలూ ఉన్నాయి.

నీటి కుంటలా రైల్వే గేట్ రోడ్డు

పట్టణంలోని భాష్యం స్కూల్, ఇఎస్ఐ ఆస్పత్రి వద్ద ఉన్న రైల్వే గేట్ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు పూర్తిగా కోతకు గురి కావడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక బైక్‌పై వెళ్లేవారు అదుపుతప్పి కిందపడిపోతున్నారు. క్రాంతి నగర్, లేబర్ కాలనీ, కల్లుబావి, శంకర్ నగర్, రాజా సాహెబ్ నగర్, నారాయణపురం, ధణాపురం, ఆలూరు వెళ్లేవారు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు గ్రావెల్‌తోనైనా రోడ్డుకు వద్ద గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.


నీటి కుంటలా మారిన రైల్వే గేట్ రోడ్డు

సొంత గూటికి బసవరాజు

- వైసిపి నుంచి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - కౌతాళం

సౌద్రీ బసవరాజు సొంత గూటికి చేరారు. టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, కౌతాళం మండల కన్వీనర్ చూడి ఉలిగయ్య, వెంకటపతి రాజు సమక్షంలో వైసిపి నాయకులు, మాజీ ఎంపిటిసి సౌద్రీ బసవరాజు, గిరి తమ అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. గురువారం టిడిపి కార్యాలయంలో వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపిలో చేరడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి, కార్యకర్తలతో కలిసి ప్రజాసేవ చేయడానికి అంకితం అవుతానని తెలిపారు. బసవరాజు గతంలో టిడిపి నుంచి కౌతాళం-1 ఎంపిటిసిగా గెలుపొందారు. అనంతరం వివిధ కారణాల వల్ల వైసిపిలో చేరారు. మళ్లీ టిడిపిలో చేరడంతో సొంత గూటికి చేరినట్లయింది. తోవి గ్రామం పాఠశాల ఛైర్మన్‌గా గెలుపొందిన లక్ష్మన్న పూలమాలలతో సన్మానించారు. సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, చూడి శివ, కురువ వీరేష్, జనసేన రామాంజులు, సుబ్బరాజు, తిప్పలదొడ్డి మల్లయ్య, ముక్కన్న, శివమూర్తి, మాలపల్లి లక్ష్మన్న, రాంబాబు, నీలకంఠ రెడ్డి, పోతులయ్య, మహాదేవ, తోవి శంకర్, ఎరిగేరి రామలింగ, గిడ్డయ్య, బసవరాజు, రాజానందు, బ్లడ్ బసవరాజు, హుస్సేని పాల్గొన్నారు.


టిడిపిలో చేరుతున్న బసవరాజు

ఎల్ఐసి పరిరక్షణకు కృషి చేయాలి

- ఎల్ఐసి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం
- ఎఐఐఇఎ కడప డివిజన్ నాయకులు సునీయ్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసి పరిరక్షణకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని, ఎల్ఐసి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం చేస్తుందని ఎఐఐఇఎ కడప డివిజన్ నాయకులు సునీయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎల్ఐసి కార్యాలయంలో ఎమ్మిగనూరు బ్రాంచి ఎఐఐఇఎ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఐఇఎ కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అక్బర్ బాషా, సహాయ కార్యదర్శి రాజు రమేష్, కార్యవర్గ సభ్యులు సునీయ్ కుమార్ మాట్లాడారు. యూనియన్ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఎల్ఐసి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిత్యం పోరాటం చేస్తున్నామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు.

బ్రాంచి నూతన కమిటీ ఎన్నిక

ఎఐఐఇఎ బ్రాంచి నూతన కమిటీ అధ్యక్షులుగా కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా టి.రాము, ప్రధాన కార్యదర్శిగా బి.విజయ్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఐజి.రఘునాథ్ గౌడ్, ఆర్థిక కార్యదర్శిగా బ్రహ్మానందరెడ్డి, కమిటీ సభ్యులుగా ఎన్.అంపయ్య, ఎం.గోవర్ధన్, ఎన్.పరమేశ్వర్ రెడ్డి, జై.మురళీకృష్ణ, డి.శ్రీవాణి, డివిజన్ కమిటీ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న సునీయ్ కుమార్

'ప్రయివేట్ వ్యక్తుల జోక్యంపై చర్యలు చేపట్టాలి'

ప్రజాశక్తి - నందవరం

నందవరం కెనరా బ్యాంకులో ప్రయివేట్ వ్యక్తుల జోక్యంపై బ్యాంకు మేనేజర్ చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. గురువారం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నందవరం కెనరా బ్యాంకులో ప్రయివేట్ వ్యక్తుల హవా కొనసాగుతోందని తెలిపారు. ప్రయివేట్ వ్యక్తులు రైతుల రుణాలను కట్టి ఒక్క రోజులోనే రుణాలు ఇప్పిస్తున్నారని చెప్పారు. రైతులు స్వయంగా రుణాలు కడితే 15 రోజులు గడిచినా రుణం రావడం లేదని మండల రైతులు వారి బాధను తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కెనరా బ్యాంకు లావాదేవీల్లో ప్రయివేట్ వ్యక్తుల జోక్యంపై స్పందించి చర్యలు తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

సోలాపూర్‌లో పుస్తకావిష్కరణలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

రచయిత, బాలసాహిత్య రత్న సోమన్న పుస్తకాలను మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఆవిష్కరించారు. మండలంలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన '53 పాల బుగ్గలు-పూల మొగ్గలు 54 కాంతి కిరణాలు' రెండు పుస్తకాలను ఒకే వేదికపై ఆవిష్కరించారు. సోలాపూర్‌లో తెలుగు భాషాభివృద్ధి సార్వజనిక్ గ్రంథాలయ అధ్యక్షులు మల్లికార్జున కమటం, ప్రముఖ వ్యాపారవేత్త గణేష్ బుదారం, రచయిత్రి, రాధా సురేష్ యర్జల్, ఈర్ల సమ్మయ్య, ప్రముఖ రచయిత శ్జాగిరి యాదగిరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను కళాపోషకులు, విశ్రాంత ఉపాధ్యాయులు రాజగోపాల్ దంపతులకు అంకితమిచ్చారు. వ్యాఖ్యాత రేణుకా బుదారం పాల్గొన్నారు.

తెలుగు భాషకు మూలం ద్రావిడ భాష

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - ఆలూరు

దేశంలో 22 అధికారిక భాషల్లో ఒకటిగా వెలుగుతున్న తెలుగు భాషకు ద్రావిడ భాష మూలమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.జ్ఞానేశ్వర్ తెలిపారు. గురువారం క్రీడా, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ఆలూరులోని ఆయా పాఠశాలలు, కలశాలల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్, బాయ్స్-2 పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కేంజడప్ప అధ్యక్షతనలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ మాట్లాడారు. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించారన్నారు. 1966లో తెలుగు భాషను అధికార భాషగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గిడుగు రామమూర్తి వాడుక భాషను ప్రజలు చెంతకు చేరే విధంగా తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి చేరువయ్యేలా కృషి చేశారని తెలిపారు. అనంతరం తెలుగు శాఖ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, క్రీడా ఉపాధ్యాయులకు శాలువా కప్పి సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.మాధవి, ఆర్‌కె.సుశీల, బి.లక్ష్మి నరసమ్మ, ఎ.ముద్దప్ప, రికార్డు సహాయకులు శేఖర్, ప్రణయ్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు బాలకృష్ణ, సద్గురు, బాయ్స్-2 ఉపాధ్యాయులు పిడి.కవిరాజు, శ్రీనివాసులు, రవికుమార్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ హైస్కూల్‌లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు శిరీష, సునీల్, ఉపాధ్యాయులు ఈరన్న మాట్లాడారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు వినోదాత్మకమైన ఆటల పోటీలను ప్రదర్శించారు. తర్వాత భవన నిర్మాణ కార్మికులు, పదో తరగతి విద్యార్థులు, కబడ్డీ క్రీడను సంతోషంగా ఆడారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, పర్యవేక్షకులు భీమేష్, జయలక్ష్మి, రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** ఎపి మోడల్ స్కూల్‌లో తెలుగు భాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహిన్ పర్వీన్, గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్, ఎస్ఎంసి ఛైర్మన్ గౌస్, వైస్ ప్రిన్సిపల్ నల్లమల పద్మావతి, వైస్ ఛైర్మన్ దోమ విమల, గానుగ బాష, ఎపి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. **ఆదోని**లోని గర్ల్స్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్, అవోపా, వ్యామ్ ఆధ్వర్యంలో తెలుగు భాష, జాతీయ క్రీడల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులకు ఆటల పోటీలు, తెలుగు వెలుగు మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ శ్రీనాథ్ గుప్తా, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, వెంకటేశ్వర శెట్టి, మమత, అనూష, అరుణ, మాధురి ఉన్నారు. అలాగే నేషనల్, జిఎస్‌ఆర్ స్కూల్‌లో పాఠశాల అధినేత జి.గోపాల్ రెడ్డి, డైరెక్టర్ ఎస్.విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. విశ్వనారయణ జూనియర్ ఒకేషనల్ కళాశాలలో ప్రిన్సినల్ మల్లికార్జున గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తెలుగు ఉపాధ్యాయులు మలేకార్ నాగజ్యోతి సతీసమేతంగా సన్మానించారు. తెలుగు భాష సాహిత్యం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండలంలోని పెద్దతుంబలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశులు గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పాటలు, పద్యాలు, నృత్యాలతో అలరించారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు పిండి వంటలు చేసి ఉపాధ్యాయులకు వడ్డించారు. విద్యార్థినులు లంగా, ఓణీ, చీరలు ధరించి తెలుగు వారి సాంప్రదాయాన్ని గౌరవించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య పాల్గొన్నారు.


ఆదోని విశ్వ నారాయణ కళాశాలలో


ఆలూరులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్


కౌతాళం ప్రతిభ హైస్కూల్‌లో


గోనెగండ్లలో

పంటల మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వండి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



ఒకే పంటను సాగు చేయకుండా వివిధ రకాల పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎఒ జయలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు ఇప్పటివరకు 6,346 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నారని తెలిపారు. పంట నమోదులో నంచర్ల గ్రామం వెనుకబడిందని, రైతులు చొరవ చూపి పంట నమోదును వేగవంతం చేసుకోవాలని కోరారు. అంతర పంటలుగా కూరగాయల పంటలు సాగు చేస్తే రైతులకు త్వరగా లాభాలు చూడడానికి ఆస్కారం ఏర్పడుతుందని తెలిపారు. వేసిన పంటను పదేపదే వేస్తే ఆ పంట దిగుబడి కూడా రాకుండా నష్టాలే మిగులుతాయని చెప్పారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రతాప్ నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన ఎర్రబాడు పాఠశాల కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని ఎర్రబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ముగిశాయి. గతంలో రెండుసార్లు పాఠశాల నిర్వహణ కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించగా వాయిదా పడ్డాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మూడోసారి ఎన్నికలు నిర్వహించగా ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఇఒ రామాంజనేయులు తెలిపారు. ఎర్రబాడు జిల్లా పరిషత్ హైస్కూలు కమిటీ ఛైర్మన్‌గా పాపారాయుడు, వైస్ ఛైర్మన్‌గా జగ్గుల విమలమ్మ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా పి.షేక్షావలి, వైస్ ఛైర్మన్‌గా సి.కవిత ఎన్నికైనట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్, స్రవంతి, గ్రామ నాయకులు మౌల, శ్రీను, కె.షేక్షావలీ, కుమార్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆకాంక్షించారు. గురువారం ఆదోని మున్సిపల్ మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మైదానం నుంచి క్రీడాజ్యోతితో ఎమ్మెల్యే పార్థసారథి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజుకు రెండు గంటల పాటు ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఆదోని మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, క్రీడాకారుల సంఘం అధ్యక్షులు విట్టా రమేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, పిఇటిలు నరసయ్య, రామన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. గురువారం పట్టణంలోని పర్వతాపురంలో పర్యటించి అక్కడ నిర్మించిన సామూహిక మురుగుదొడ్డిని ప్రారంభించారు. గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి లేదని, చిన్న పాటి వర్షం వచ్చినా వీధుల్లో నీరు నిలవడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణ శివారులో వార్డు ఉన్నప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల మురుగునీరు నిలిచి ఉందన్నారు. సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించేలా శ్రద్ధ చూపుతామని చెప్పారు. వార్డులో ఏ సమస్య ఉన్నా నేరుగా తన దగ్గరకు వచ్చి తెలపాలన్నారు. మున్సిపల్ కమిషనర్ అనుపమ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, టిపిఒ శ్రీనివాసులు ఉన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

అమ్మాయిలు, మహిళలపై ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ పరమేష్ నాయక్ హెచ్చరించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహకాలు ఉంటాయని చెప్పారు. అంతకుముందు ఎస్ఐని పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు వితోబరావు, చంద్రశేఖర్, నాగభూషణం, గోపాల్, రామన్న, సత్యనారాయణ, బసవరాజు, ఈరన్న, అన్వర్, ఉమా మహేశ్వరి, సుల్తానా, పుష్పలత, సంధ్యారాణి, సుభాషిని పాల్గొన్నారు.


ఎస్ఐని సన్మానిస్తున్న సిబ్బంది

'సూర్య ఘర్' ఓ సువర్ణ అవకాశం

- ఇంటి పైకప్పుపై అమర్చుకోవచ్చు
- సబ్సిడీ పొందవచ్చు
- ఎఇ చెన్నయ్య

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ఇంటి యజమానులకు ఓ సువర్ణ అవకాశమని విద్యుత్ శాఖ ఆదోని రూరల్ ఎఇ చెన్నయ్య తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్.. రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్లకు సబ్సిడీ ఎలా పొందాలనే విషయంపై ఆయన పలు వివరాలు తెలిపారు. ఆయన మాటల్లోనే... ఇటీవల ప్రకటించిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సబ్సిడీ ధరకే ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. సబ్సిడీ పొందడంతో పాటు ఇంటికి జీవితకాలం ఉచితంగా విద్యుత్ పొందవచ్చు. పిఎం సూర్య ఘర్ యోజన పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు గ్రామీణ ప్రజలు ముందుకు రావాలి.




సామాన్యులకు, ప్రభుత్వానికి ప్రయోజనం

ఈ పథకం వల్ల సామాన్యులు, ప్రభుత్వం ఇద్దరూ లబ్ధి పొందుతారు. సాధారణ ప్రజలు తమ ఇళ్ల పైకప్పుపై సౌరశక్తితో విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. తద్వారా విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి పొందవచ్చు. ప్రతి నెలా వేల రూపాయలు ఆదా అవుతాయి. సౌరశక్తి నుంచి మరింత ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా విద్యుత్ అవసరాల్లో భారత్ స్వావలంబన సాధించగలుగుతాం. రూ.78 వేల వరకు సబ్సిడీ అధికారిక ప్రకటన ప్రకారం 1 కిలోవాట్ సోలార్ ప్యానెల్ సిస్టమ్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుంది. 2 కిలోవాట్ల ప్యానల్‌కు రూ.60 వేలు సబ్సిడీ, 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్ సిస్టమ్‌కు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

తాకట్టు లేకుండా చౌక వడ్డీ రుణం

సబ్సిడీ పోను సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు వెచ్చించే అదనపు మొత్తాన్ని రుణం రూపంలో పొందవచ్చు. దీనిపై తక్కువ వడ్డీ వర్తిస్తుంది. ఈ లోన్ కోసం ప్రజలు ఎలాంటి పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రకటన ప్రకారం ఇంటి పైకప్పుపై గరిష్టంగా 3 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర ఫలకాలను బిగించుకోవడానికి 7 శాతం వడ్డీ రేటుతో కొలేటరల్ ఫ్రీ లోన్ తాకట్టు లేని రుణం అందుబాటులో ఉంటుంది. ముందుగా https://pmsuryaghar.gov.inలో రిజిస్టర్ చేసుకోవాలి. తర్వాత రిజిస్ట్రేషన్ కోసం, విద్యుత్ పంపిణీ సంస్థ పేరు, కస్టమర్ నెంబర్, మొబైల్, ఈ-మెయిల్ అవసరం. వినియోగదారుడు/కస్టమర్ నెంబర్, మొబైల్ నెంబర్ సహాయంతో పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి. రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్ కోసం దరఖాస్తు చేయడానికి ఫామ్‌ను ఎంచుకోవాలి. అనంతరం సమీక్ష తర్వాత, అర్హుడైన దరఖాస్తుదారుకు ఆమోదం లభిస్తుంది. ఆమోదం పొందిన తర్వాత సంబంధిత డిస్కంలో నమోదు చేసుకున్న ఏదైనా విక్రేత నుంచి ప్యానెల్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ తర్వాత, ప్లాంట్ వివరాలను సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత, డిస్కమ్ తనిఖీ తర్వాత, పోర్టల్‌లో కమిషనింగ్ సర్టిఫికెట్ అందుబాటులో ఉంటుంది. సర్టిఫికెట్ వచ్చిన తర్వాత బ్యాంకు ఖాతా వివరాలు, క్యాన్సిల్ చేసిన చెక్‌తో సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. 30 రోజుల్లోగా బ్యాంకు ఖాతాకు సబ్సిడీ మొత్తం క్రెడిట్ అవుతుంది. తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను వినియోగించుకునే చక్కటి అవకాశం ఉంది. మరిన్ని వివరాలకు 9440813384 నెంబర్‌కు సంప్రదించవచ్చు.


ఎఇ చెన్నయ్య


సమావేశంలో మాట్లాడుతున్న గురు శేఖర్

రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం దేవనకొండలోని సుంకులమ్మ దేవాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు సూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత రజక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఫెడరేషన్ ద్వారా ఇప్పటివరకు రజక వృత్తిదారులకు పనిముట్లు, ఆర్థిక సహకారం అందించారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం ఫెడరేషన్‌ను కార్పొరేషన్ చేసి నిధులు కేటాయించకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. రజక సొసైటీలకు రుణాలు అందించాలని తెలిపారు. రజక వృత్తిదారులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ తరహాలో సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రజక వృత్తిదారులకు రూ.5 వేల పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు చిన్న ఎల్లప్ప, కేశవ్, చంద్రప్ప, చిరంజీవి, నాగప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా వేలం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి పంచాయతీ ఆవరణలో టమోటా, కూరగాయల మార్కెట్ వేలం హోరాహోరీగా సాగింది. గురువారం ఇన్‌ఛార్జీ డిఎల్‌పిఒ రామ్ మూర్తి ఆధ్వర్యంలో మార్కెట్ వేలం నిర్వహించారు. సర్పంచి మూలింటి రాధమ్మ అధ్యక్షతన వేలంపాట ప్రారంభించారు. ఈ వేలంపాటలో ఐదుగురు పాట దారులు పాల్గొన్నారు. రసవత్తరంగా సాగిన వేలంపాట చివరికి కట్టెల లక్ష్మీనారాయణ రూ.65 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈఏడాది పంచాయతీకి రూ.8.99 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. పాడిన మొత్తం 15 రోజులకు కట్టాలని అధికారులు తెలిపారు. జడ్‌పిటిసి దొరబాబు, కెడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి జంప్లా నాయక్, వైస్ సర్పంచి వెంకటేశ్వరమ్మ, గ్రామ పెద్దలు ఎస్.తిమ్మన్న, వెంకటరాముడు, సంజప్ప, గోవిందప్ప, నరసప్ప పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జీ డిఎల్‌పిఒ రామ్ మూర్తి